# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను దృశ్య మాధ్యమం ద్వారా ఈ ఉదయం అందజేశారు.**
2. **కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ తిరుపతి జిల్లాలో రేపు పర్యటిస్తారు.**
3. **యువత దేశానికి వెన్నెముక అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు.**
4. **ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను క్రమబద్ధం చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.**
5. **రాష్ట్రంలో ఆలయాలను పునర్ నిర్మిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.**

==========================

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు ఉదయం అందజేశారు. కొత్తగా ఉద్యోగాల్లో నియామక పత్రాలను పొందిన వారు రైల్వే శాఖ, రక్షణ శాఖ, తపాలా విభాగం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆర్థిక సేవల విభాగం, కార్మిక, ఉపాధి కల్పన శాఖలతో పాటు ఇతర మంత్రిత్వ శాఖల్లోనూ, విభాగాల్లోనూ చేరుతారు. దేశవ్యాప్తంగా 47 చోట్ల 51 వేల మంది 'రోజ్‌గార్ మేళా' ద్వారా నియామక పత్రాలు పొందారు.

---------------------------

కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ రేపు తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు. ఏర్పేడులోని ఐఐటిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్‌తో కలిసి ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

---------------------------

యువత దేశానికి వెన్నెముక అని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో రోజ్ గార్ మేళా కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కేంద్రమంత్రి నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్...31 సెకన్లు

కాగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలకు ఎంపికైన 74 మంది అభ్యర్థులకు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ నియామక పత్రాలు అందజేశారు.

-----------------------------

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల డిమాండ్లను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించారని పేర్కొన్నారు. ఆర్థిక శాఖతో చర్చించి అధికారికంగా ప్రకటిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

-----------------------------

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో పాటు ఆయా నియోజకవర్గాల, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషి మొదలైన అంశాలను మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు ప్రజలకు వివరిస్తున్నారు. ఈరోజు చిత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి ఎమ్. రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..

వాయిస్..32 సెకన్లు

-----------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈనెల 24వ తేదీన అమరావతి రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి వర్గ సమావేశంలో ప్రస్తావించాల్సిన ప్రతిపాదనలను ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా సాధారణ పరిపాలన శాఖకు పంపాలని ఆయన అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

-----------------------------

ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను క్రమబద్ధం చేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లాలో 35 కోట్ల రూపాయలతో చేపట్టిన హై లెవల్ కాలువ మరమ్మతు పనులను శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులుతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. తుంగభద్రా హెచ్ఎల్సి కాలువలో సజావుగా నీరు పారేలా పనులు చేస్తున్నట్లు మంత్రి వివరిస్తూ..

వాయిస్... 31 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను పునర్నిర్మిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలోని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని మంత్రి ఈరోజు

దర్శించుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 161 ప్రధాన ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతను పెంచామని మంత్రి చెబుతూ..

– వాయిస్... 34 సెకన్లు

----------------------------

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ ఉదయం ధవళేశ్వరం వద్ద 10 అడుగుల నీటిమట్టం ఉండగా, బ్యారేజీ నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

----------------------------

మూత్ర సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ–ఎయిమ్స్ వద్ద ఈ ఉదయం 2 కిలో మీటర్ల పరుగు నిర్వహించారు. మంగళగిరి ఎయిమ్స్ సంచాలకులు డాక్టర్ శాంతా సింగ్ ర్యాలీని ప్రారంభించారు. మందులు, శస్త్ర చికిత్సలు లేకుండానే కేవలం వైద్యుల సలహాలు పాటించడం ద్వారా అనేక మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గించుకోవచ్చని, ఈ అంశంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీని ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు.

----------------------------

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ లో భాగంగా భారత్– ఇంగ్లండ్ మధ్య రెండో టెస్ట్ కొనసాగుతోంది. 251 పరుగుల నుంచి రెండో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ 387 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 145 పరుగులకు 3 వికెట్లు నష్టపోయింది. కేఎల్.రాహుల్ 53 పరుగులు, పంత్ 19 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.

----------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలో వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు, రేపు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..33 సెకన్లు

======================